# ముఖచిత్రం గురించి మూడు ముక్కలు

# బృహదీశ్వరాలయము

గ్రహించినది : శ్రీనివాసరావు అయినాపురపు.



బృహదీశ్వరాలయము తంజావూరులో ప్రసిద్ధ క్షేత్రము. ఈ శివుని ఆలయమును చోళుల కాలములో మొదటి రాజరాజచోళుడు 6 సంవత్సరముల కాలములో నిర్మింపజేసాడు. ఇది భారతదేశములోనే అతి పెద్దదైన శివాలయముగా పేరుగాంచినది. 9 అడుగుల ఎత్తు కలిగి, 23 1/2 అడుగుల చుట్టుకొలత కలిగిన శివలింగం అన్ని దిశలలోనూ పెరుగుతుంటే, దానిని ఆపేందుకు వెనుకవైపు ఒక మేకును కొట్టినట్లు చెబుతారు. దీనిని 'దక్షిణ మేరు'గా, దక్షిణప్రాంతపు హిమాలయములుగా తలంచడం పరిపాటి. వేల మంది కార్మికులు ఆరు నెలల పాటు శ్రమించి నర్మదానది ద్వారా ఆ శివలింగాన్ని రవాణా చెయ్యడం జరిగింది.

ఈ ఎత్తైన గోపురం, దానిపైన ధగధగలాడే కలశం ఎవరినైనా తల ఎత్తి చూసేలా చేస్తాయి. 14 అంతస్థుల (216 అడుగులు) ఎత్తు చూసేవారికి ఆనందాన్ని కలిగిస్తుంది. ఈ నిర్మాణంలో 80 టన్నుల బరువుండే ఏకశిలను అంత ఎత్తుకు చేర్చడానికి ఆరు మైళ్ళ పొడవుగల ఏటవాలు దారిని ఏర్పరచారని చరిత్ర చెబుతోంది. ఇది ఈజిప్ట్‌లో పిరమిడ్ల నిర్మాణమునకు ఉపయోగించిన పద్ధతి కూడా!

ఇక ఇక్కడ ఉన్న నంది 19 1/2 అడుగుల పొడవు, 8 1/4 అడుగుల వెడల్పు, 12 అడుగుల ఎత్తు కలిగి, 25 టన్నుల బరువుతో కన్నుల పండుగ చేస్తుంది. ఇది ఏకశిలతో చెక్కబడి, భారతదేశములో రెండవ అతిపెద్ద విగ్రహముగా చెప్పబడుతోంది.

- సుశ్రీ.